క్లుప్తంగా

సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించండి



పాన్‌గల్: చిన్నారులు, గర్భిణులలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించుకునేలా వైద్య సిబ్బంది వారిని చైతన్యం చేస్తూ అవగాహన కల్పించాలని సీహెచ్‌ఓ రామయ్య తెలిపారు. శనివారం మండలంలోని గోప్లాపూర్ సబ్‌సెంటర్‌ను సందర్శించి వ్యాధి నిరోధక టీకాలపై ఆరా తీశారు. చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించడంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, గర్భిణులు సకాలంలో వ్యాక్సిన్ తీసుకోవడంతో వ్యాధుల బారిన పడకుండా అరికట్టవచ్చన్నారు. దీంతో పాటు పౌష్టికాహారం, ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నర్సమ్మ, నాగేశ్వరి, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

టీచర్లను వెనక్కి రప్పించాలని నిరసన

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తున్న ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై జిల్లా కేంద్రానికి బదిలీ చేయడాన్ని నిరసిస్తూ శనివారం మండల కేంద్రంలో సీపీఎం నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. బాలుర ఉన్నత పాఠశాలతో పాటు బాలికల ఉన్నత పాఠశాలలో కూడా ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయులు లేరని, దీంతో రెండు పాఠశాలలోని విద్యార్థులకు ఇంగ్లిష్ విద్య అందక నష్టపోతారని సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి అన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను తిరిగి రప్పించాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు బాలస్వామి, వెంకటయ్య, ఆశన్న, వెంకటేశ్వర్లగౌడ్, ఈశ్వర్, శేఖర్‌రెడ్డి, నవీన్, వెంకన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బస్సు, ట్రక్కు ఢీ: వ్యక్తికి గాయాలు

వనపర్తి రూరల్: ట్రావెల్స్ బస్సు, ట్రక్కు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన శనివారం రంగాపురం బ్రిడ్జి దగ్గర చోటుచేసుకుంది. పెబ్బేరు ఎస్‌ఐ యుగేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. బళ్లారి నుంచి హైదరాబాదు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు శనివారం 2 గంటల సమయంలో పెబ్బేరు మండలంలోని రంగాపురం బ్రిడ్జి మధ్య ముందు వెళ్తున్న ట్రక్కును ఢీకొట్టింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న మొహర్ పంచాల్‌కు గాయాలయ్యాయి. అతన్ని వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బస్సు ఓనర్ నిజముద్దీన్ శనివారం పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్‌పై ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టిప్పర్, బైక్‌ను ఢీ: వ్యక్తికి గాయాలు

వనపర్తి రూరల్: టిప్పర్, బైకును ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన పెబ్బేర్ మండలంలోని కంచిరావుపల్లి గ్రామ శివారులో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ యుగేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేరు పట్టణానికి చెందిన కోళ్ల విజయకుమార్ బైక్‌పై కంచిరావుపల్లి శివారులోని భారత్ పెట్రోల్ బంక్‌లో పెట్రోలు వేయించుకోవడానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వనపర్తి వైపు నుంచి టిప్పర్ అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి కింద పడిన విజయకుమార్ తలకు తీవ్ర గాయాలు కావడంతో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అక్కడి నుంచి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. బాధితుడి చిన్నాయన బాలస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణంలోని డబుల్ బెడ్రూం కాలనీకి చెందిన వ్యక్తి ఈ నెల 26నుంచి బుల్లెద్దుల ఎల్లయ్య కనిపించడం లేదని వారి కుమారుడు బుల్లెద్దుల శాంతకుమార్ శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ యుగేంధర్‌రెడ్డి తెలిపారు. పెబ్బేరు మున్సిపాలిటీలోని చెలిమిల్ల గ్రామానికి బుల్లెద్దుల శాంతకుమార్ కుటుంబంతో కలిసి పెబ్బేరు పట్టణంలోని డబుల్‌బెడ్రూం కాలనీలో బ్లాక్ నెం 1, రూమ్ 102లో ఉంటున్నారు. ఈ నెల 26న ఉదయం బుల్లెద్దుల ఎల్లయ్య ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుమారుడు శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సామర్థ్యాలను పెంచాలి

ఖిల్లాఘనపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ జయశంకర్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని ఆముదంబండ తండా, గార్ల బండ తండాల్లోని ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. విద్యార్థులతో చదివించి, రాయించి వారి విద్యా ప్రమాణాలను పరిశీలించారు.

కొత్తకోటలో సమస్యలు పట్టవా?

- కనిపించని సీసీ రోడ్లు, డ్రైయినేజీలు
- ఇళ్ల మధ్యన పారుతున్న మురుగు
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- ఇబ్బందులు పడుతున్న పట్టణ ప్రజలు



కొత్తకోట పట్టణంలో డ్రైయినేజీ లేక రోడ్డుపై పారుతున్న మురుగు

కొత్తకోట రూరల్: కొత్తకోట పట్టణ దినదినాభివృద్ధి చెందుతున్నా, కొత్త కాలనీలతో పాటు పాత కాలనీల్లో సమస్యలు 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్న చందంగా తయారయ్యాయి. పట్టణంలో దాదాపు 5300 నివాస గృహాలు, 25వేలకు పైగా జనాభా, 15 వార్డులు ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏటా కొత్తకోట పట్టణంలో సెటిలర్స్ సంఖ్య పెరుగుతూనే ఉంది. దీంతో పట్టణం విస్తరిస్తూ కొత్త కాలనీలు రూపుదిద్దుకుంటున్నాయి. ముఖ్యంగా అటు 44వ జాతీయ రహదారికి చేరువలో, ఇటు పట్టణానికి సమీపంలో నూతనంగా శ్రీరాంకాలనీ, కొత్త రాఘవేంద్ర కాలనీ, అంబేడ్కర్ కాలనీలు విస్తరిస్తున్నాయి.

డ్రైయినేజీలు లేక కంపు కంపు..

కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేవు. డ్రైయినేజీ వ్యవస్థ, విద్యుత్, తాగునీరు వంటి వసతులు లేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ స్తంభాలు, డ్రైయినేజీలు, సీసీరోడ్లతో పాటు అనేక సమస్యలతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీలో ఈ విధంగా సమస్యలు రాజ్యమేలుతుంటే గ్రామీణ ప్రాంతాల పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొత్తగా వెలుస్తున్న కాలనీలలో ఎలాంటి అభివృద్ధి పనులను నిర్వహించక పోవడంతో కాలనీ వాసులు అగ్రహానికి గురవుతున్నారు. కాలనీలో కంపచెట్లు ఏపుగా పెరగడం, డ్రైయినేజీలు వ్యవస్థ లేకపోవడం మూలంగా విష సర్పాలు అధికమవుతున్నాయి. విష సర్పాల నుంచి పిల్లలకు ప్రమాదం పొంచిఉందని కాలనీప్రజలు మున్సిపల్ సిబ్బంది విన్నవించినా పట్టించుకోవడం లేదు. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా రూపాంతరం చెందిన కొత్తకోటలో పాత సమస్యలే కనిపిస్తున్నాయి.



కొత్త కాలనీలో మట్టిరోడ్డు

సమస్యలు పరిష్కరించాలి



కొత్తకోట పట్టణం జాతీయ రహదారిపై ఉండటం వల్ల దినదినాభివృద్ధి చెందుతోంది. కొత్తగా కాలనీలు వెలుస్తున్నాయి. అధికారులు కాలనీల అభివృద్ధిపై దృష్టి సారించాలి. పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు అధికారులు, పాలకులు ప్రత్యేక చొరవ చూపాలి.

– ముంత రాములుయాదవ్, దండుగడ్డ కాలనీ, కొత్తకోట

డ్రైయినేజీలు నిర్మించాలి



పట్టణం పారిశుద్ధ్యంగా ఉండాలంటే కాలనీల్లో డ్రైయినేజీ వ్యవస్థను నిర్మించాలి. అప్పుడే మురుగు రోడ్ల పై పారకుండా ఉంటుంది. దీంతో ప్రజలు రో గాల బారిన పడకుండా ఉంటా రు. కొత్తగా వెలుస్తున్న కాలనీల్లో ఎక్కడా డ్రైయినేజీ నిర్మాణం లేదు. వెంటనే అధికారులు స్పందించి కొత్త కాలనీలపై దృష్టి సారించాలి.అస్తవ్యస్తంగా ఉన్న డ్రైయినేజీ వ్యవస్థను సరిచేయాలి. దోమల నివారణకు పట్టణంలో తరచుగా ఫాగింగ్ చేపట్టాలి.

– రాజారాం, 11వ వార్డు నివాసి, కొత్తకోట

సమస్యలు ఎవరికి చెప్పకోవాలి?



మున్సిపల్ పాలకవర్గం పదవీ కాలం పూర్తయి ఏడాది కావస్తోంది. కాలనీల్లో నెలకొన్న సమస్యలను ఎవరికీ చెప్పుకోవాలి. కౌన్సిలర్లు ఉన్నప్పుడు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్తే వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేవాళ్లు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది కాలనీల్లో తిరిగి సమస్యలను గుర్తించి పరిష్కరించాలి.

– చీర్ల నాగన్నసాగర్, 8వ వార్డు, మాజీ కౌన్సిలర్, కొత్తకోట

ఎంపీడీఓ దంపతులకు సన్మానం



వనపర్తి రూరల్: పెబ్బేరు మండల ఎంపీడీఓ రవీంద్ర 1 సంవత్సరం 6 నెలలుగా విధులు నిర్వహిస్తూ ఈ నెల 30న పదవీవిరమణ చేయనున్న సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని సహారా ఫంక్షన్ హాల్లో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాని ఎంపీఓ రోజా అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ ఉమాదేవి. జెడ్పీ సీఈఓ యాదయ్య, డిప్యూటీ సీఈఓ రామేశ్వర్‌రెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ గౌని ప్రమోదిని, వైస్ చైర్మన్ ఎద్దుల విజయ వర్ధన్‌రెడ్డి, పలువురు నాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొని ఎంపీడీఓ దంపతులను శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కి శ్రీనివాస్‌గౌడ్, వెంటేష్‌సాగర్, సురేందర్‌గౌడ్, రామన్‌గౌడ్, యుగంధర్‌రెడ్డి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మదనాపురం: మదనాపురం జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో శనివారం ప్రధానోపాధ్యాయులు ఈ. మద్దిలేటి అధ్యక్షతన వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వేప, కానుగ, దానిమ్మ, నేరేడు మొదలైన 150 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో విద్యాధికారి ఫరూర్ హుస్సేన్, పంచాయతీ సెక్రటరీ రఘు, నాయకులు వెంకట్ నారాయణ, వడ్డే కృష్ణ, ఎం.కె.కుర్మన్న వేమన, సత్యశీలా రెడ్డి ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

వనపర్తిటౌన్: కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల ఆగడాలు ఎక్కువయ్యాయని, నిబంధనలకు విరుద్ధంగా తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎత్తం మహేష్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ఢిల్లీ వరల్డ్ స్కూల్, శ్రీ చైతన్య స్కూల్ యాజమన్యం విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయా పాఠశాలల ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఢిల్లీ వరల్డ్ స్కూల్ పేరులో వరల్డ్ అనే పదాన్ని తొలగించాలని, పాఠశాలల పేర్లల్లో వరల్డ్, నేషనల్ అనే పదాలు పెట్టటం విద్య హక్కు చట్టానికి విరుద్ధమన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు చందు, విష్ణు, అరవింద్, చరణ్, విజయ్, లక్ష్మమ్మ, భరత్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పర్యటనలో ఇబ్బందిపడ్డ జనం

అమరచింత: జూరాల ప్రాజెక్టు సందర్శన కోసం శనివారం ఉదయం 11:30 నిమిషాలకు రావాల్సి ఉండగా, మధ్యాహ్నం 2 గంటల తర్వాత మంత్రి డ్యాం వద్దకు చేరుకోవడంతో ప్రాజెక్టుపై జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జూరాల ప్రాజెక్టుకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో పాటు మంత్రి వాకిటి శ్రీహరి వస్తున్నారనే సమాచారంతో ఉమ్మడి మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా డ్యాంకు తరలొచ్చారు. ప్రాజెక్టు క్రస్ట్‌గేట్ల ద్వారా వరదనీరు ముందుకు వెళ్తుండడంతో పర్యాటకులు సైతం అధిక సంఖ్యలో తరలొచ్చారు. ఇటు కాంగ్రెస్ నాయకులు, పర్యాటకులతో ప్రాజెక్టు పరిసరాలు నిండుకున్నాయి. మంత్రి బందోబస్తుతో పోలీసులు ఎవరి వాహనాలను ప్రాజెక్టుపైకి అనుమతించకపోవడం, తినుబండారాలు, పల్లీలు అమ్ముకునే వారిని సైతం అక్కడి నుంచి తరలించడంతో జనం తీవ్ర ఇబ్బంది పడ్డారు.



జూరాల ప్రాజెక్టుపై కిక్కిరిసిన జనం

హెచ్‌ఎంలకు ఘన సన్మానం

పాన్‌గల్: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరం నూతన ప్రవేశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచిన ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు శనివారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థుల నమోదులో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సమిష్టి కృషితో విద్యార్థుల సంఖ్యను పెంచి మండలాన్ని ఆదర్శంగా నిలిపినట్లు ఆయన పేర్కొన్నారు. పాన్‌గల్ బాలికల ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం విజయలక్ష్మి, రేమద్దుల పీఎస్ హెచ్‌ఎం లక్ష్మీదేవమ్మ, పాన్‌గల్ పీఎస్ హెచ్‌ఎం పద్మ, పీఎస్ కొత్తపేట హెచ్‌ఎం కురుమూర్తి, పీఎస్ దొండాయిపల్లి హెచ్‌ఎం శ్రీనివాస్‌గౌడు, పీఎస్ రాయినిపల్లి హెచ్‌ఎం తిరుపతయ్య, పీఎస్ శాగాపూర్‌తండా హెచ్‌ఎం నాగరాజులను సన్మానించారు. ఇదే స్ఫూర్తితో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పనిచేస్తూ విద్యాభివృద్ధిలో మండలానికి మంచి పేరు తీసుకరావాలన్నారు. సమావేశంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.



సన్మానం పొందిన హెచ్‌ఎంలతో ఎంఈఓ శ్రీనివాసులు

పట్టణ పరిశుభ్రత అందరి బాధ్యత

వనపర్తిటౌన్: పట్టణ పరిశుభ్రత ప్రజలందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని 17, 20, 7, 11, 29వ, వార్డుల్లో 100 రోజుల కార్యాచరణలో భాగంగా వీధి, పెంపుడు కుక్కలపై అవగాహన, ఏబీసీ ప్రచారం, ఎస్‌హెచ్‌జీ కొత్త గ్రూప్, డ్రెయినేజీలో మురుగు తొలగించే పనులను పరిశీలించారు. భువన్ సర్వే, వాణిజ్య లైసెన్స్ నివాసం నుంచి వాణిజ్యానికి మార్చే పనులను చేపడుతున్నట్లు చెప్పారు. హెల్త్ అసిస్టెంట్ శివకుమార్ జిల్లా కేంద్రంలోని చికెన్ షాపులు, వ్యాపార సముదాయాలు, హోటల్స్, బేకరీలు, తదితర షాపుల్లో తనిఖీ చేశారు. ప్లాస్టిక్ వాడినందుకు, మాస్క్ లేనందుకు బేకరీ షాపు యజమానికి రూ.2,000 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ శంకరయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సాయికుమార్, వార్డ్ ఆఫీసర్ నితీష్, సూపర్‌వైజర్, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



బేకరీ యజమానికి జరిమానా విధిస్తున్న హెల్త్ అసిస్టెంట్ శివకుమార్

కళాకారుల సమస్యలు పరిష్కరించాలి

వీపనగండ్ల: తెలంగాణ ఉద్యమ సమయంలో ఆటపాటలతో ప్రజలను చైతన్యపర్చిన కళాకారులను ఆదుకోవాలని పలువు రు కళాకారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం మండల కేంద్రంలో మహనీయుల విగ్రహాల ముందు వివిధ పార్టీల, ప్రజా సంఘాల నాయకులతో కలిసి మండలంలోని కళాకారులు ఈ నెల 29న జరిగే 'హలో కళాకారుడా చలో పాలమూరు' అనే కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సీనియర్ కళాకారులు మీసాల రాము, పాము నాగులు, డప్పు నాగరాజు, రాజశేఖర్, వర్మ, గంగులు, కోలాట కళాకారుడు పెంటయ్య, బాలీశ్వరయ్య, ఎత్తం కృష్ణయ్య, రవీందర్‌రెడ్డి, ఆశన్న పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌లను విడుదల చేస్తున్న కళాకారులు, నాయకులు

రైతుభరోసా రాలేదని రైతుల నిరసన

పాన్‌గల్: మండల కేంద్రంలోని రైతు వేదిక ముందు రైతు భరోసా జమ కాలేదని వివిధ గ్రామాల రైతులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకులు వేణుగోపాల్, మండల కార్యదర్శి బాల్యానాయక్ మద్దతు రైతులకు మద్దతు తెలిపి మాట్లాడారు. చిన్న, సన్నకారు, దళిత, గిరిజన రైతులు పంటలు సాగు చేసినా రైతు భరోసా జమ కాలేదన్నారు. ప్రతిరోజు ఏదో ఒక గ్రామం నుంచి రైతు భరోసా జమ కాలేదని రైతు వేదిక వద్ద వచ్చి అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా ఈ విషయంపై వ్యవసాయ అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. ఇప్పటికైనా గ్రామాల వారీగా రైతు భరోసా రాని రైతులను గుర్తించి వారికి జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి కలెక్టరేట్ ముట్టడిస్తామన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏఓ రాజవర్ధన్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



పాన్‌గల్ రైతు వేదిక ముందు నిరసన తెలుపుతున్న రైతులు

రిజిస్ట్రేషన్లు జరగక ప్రజల ఇక్కట్లు

- తహసీల్దార్ కార్యాలయంలో సర్వర్ డౌన్
- రోజుల తరబడి ఎదురుచూపులు

పాన్‌గల్: తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. భూముల రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకుంటే వారికి ఒక తేదీని కేటాయిస్తారు. కేటాయించిన తేదీల్లో పనులు వదులుకొని ఇరు వర్గాలు వారు కార్యాలయానికి వస్తే సర్వర్‌డౌన్ అని కార్యాలయం సిబ్బంది చెబుతున్నారు. దీంతో ఉదయం నుంచి సాయంకాలం వరకు వేచిచూస్తూ నిరశగా వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. కార్యాలయానికి రోజుకు 20 నుంచి 30 రిజిస్ట్రేషన్ దరఖాస్తులు వస్తుండటం, రిజిస్ట్రేషన్లు నెమ్మదిగా సాగుతుండటంతో దరఖాస్తులు పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పదిరోజుల నుంచి ఇప్పటి వరకు చాలా రిజిస్ట్రేషన్ దరఖాస్తులు పేరుకుపోయాయి. శనివారం వరకు దాదాపుగా 50 దరఖాస్తులు ఉన్నట్లు కార్యాలయం సిబ్బంది పేర్కొన్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జి తహసీల్దార్ అబ్రహాంలింకన్‌ను వివరణ కోరగా సర్వర్ రాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్న మాట వాస్తవమేనని, దీంతో ఉదయం వేళల్లో కార్యాలయానికి ముందుగా వచ్చి రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



పాన్‌గల్ తహసీల్దార్ కార్యాలయం

సొంతింటి కల నిజం చేసిన ప్రభుత్వం



13వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

కొత్తకోట రూరల్: పేదలకు సొంతింటి కల సహకారం అవుతుందని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం కొత్తకోట మున్సిపాలిటీలోని 13వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకుంటామని లబ్ధిదారులకు భరోసానిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేదలకు సీఎం రేవంత్ రెడ్డి పేదలకు ఇచ్చిన మాట ప్రకారం 14 నెలల్లోనే ఇల్లు మంజూరు చేసి సొంతింటి కలను సాకారం అయ్యే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు. లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పారదర్శకంగా చేపట్టినట్లు తెలిపారు. ఇల్లు రానివారు నిరాశపడొద్దని, రెండో విడతలో అర్హులైన ప్రతి పేదవారికి ఇళ్లు మంజూరవుతాయని తెలిపారు. కార్యక్రమంలో శివశంకర్, సలీంఖాన్, రాంమోహన్‌రెడ్డి, పి.మోహన్‌రెడ్డి, శంకర్‌యాదవ్, ఎండీ కై సర్, గఫార్, మునీర్ తదితరులు ఉన్నారు.

పల్లెల్లో పీర్ల పండుగ సందడి

అమరచింత: మొహర్రం నెల పురస్కరించుకుని గ్రామాల్లో పీర్ల పండుగ నెలకొంది. శనివారం గ్రామాల్లోని పీర్లచావిడిలో పీర్లను భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేశారు. పట్టణంలోని పెద్దపీర్ల మసీదులో ముజావర్లు గ్రామ పెద్దల సమక్షంలో పీర్లను (ఆలం)భద్ర పరిచిన పెట్టెలలోంచి కిందకు దించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని చిన్న పీర్ల మసీదుతో పాటు గ్రామాల్లోని పీర్ల చావిడిలో ఆలంను కూర్చోబెట్టి అగ్నిగుండాలను ఏర్పాటు చేశారు. పదిరోజుల పాటు పీర్ల పండుగ కొనసాగుతుందని తెలిపారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి



గోపాల్‌పేట: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు అప్రమత్తంగా ఉండాలని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రఘు అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని అంగన్‌వాడీ టీచర్లకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలపై వివక్షత, లైంగిక వేధింపులు వంటి కార్యక్రమాలు ఎవరైనా చేస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎవరికి పడితే వారికి ఓటీపీలు చెప్పకూడదని తెలిపారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సమ్మె

ఖిల్లాఘనపురం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ల రద్దు చేయాలని కోరుతూ దేశవ్యాప్త సమ్మె చేపట్టడం జరుగుతుందని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ తెలిపారు. సమ్మెకు సంబంధించిన నోటీసును శనివారం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులకు సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్‌వైజర్, కార్మికులు అందజేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని జూలై 9న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మెడికల్ యూనియన్ ఉమ్మడి జిల్లా కోశాధికారి భాస్కర్, కార్మికులు వెంకటేష్, నస్మాబేగం, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిన్నారెడ్డి జన్మదిన వేడుకలు



వనపర్తిటౌన్: రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి జన్మదిన వేడుకలను శనివారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌక్‌లో చిన్నారెడ్డి జన్మదిన కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా డీసీసీ కార్యాలయంలో రక్తదానం చేయడంతో పాటుగా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ మేరకు డీసీసీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, కాంగ్రెస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బాబాలు మాట్లాడారు. కార్యక్రమంలో కిరణ్ కుమార్, ఖమ్మర్ మియా, కదిరే రాములు, అనీస్, చీర్ల జనార్ధన్, కురుమూర్తి, కోళ్ల వెంకటేష్, పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో చిన్నారెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్‌కుమార్, జిల్లా వికలాంగుల సంఘం ఉపాధ్యక్షులు గంజాయి రమేష్‌ల ఆధ్వర్యంలో తెంగాణ తల్లి చౌరస్తా దగ్గర కేక్ కట్‌చేశారు. మండల కేంద్రంలోని ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంచారు. కార్యక్రమంలో జిల్లా డాక్టర్ల సేల్ అధ్యక్షులు నరేందర్‌గౌడు, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ దేవన్న యాదవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల సంబురాలు

ఆత్మకూర్: తెలంగాణ రాష్ట్ర పశువర్ధక, మత్స్య, యువజన, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి చొరవతో జూరాల బ్రిడ్జి, ఇతర అభివృద్ధి పనులకు రూ.300 కోట్ల నిధులు మంజూరు చేయడంతో కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర గీత కార్మిక విభాగం చైర్మన్ కేషం నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో గాంధీచౌక్‌లో బాణా సంచా కాల్చి మంత్రి వాకిటి శ్రీహరి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా నాయకులు గాడి కృష్ణమూర్తి, గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, శ్రీనివాస్‌లు మాట్లాడారు. ఆత్మకూరు, అమరచింత మున్సిపాలిటీలకు రూ.15 కోట్ల చొప్పున రూ.30 కోట్లు నిధులు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో రామలక్ష్మారెడ్డి, గడ్డం శ్రీను, భాస్కర్ ఉన్నారు.